



పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో మాట్లాడుతున్న చంద్రబాబు

మహానాడులో ఆకట్టుకున్న 'బుల్లెట్'

గంగాధర నెల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలోని టీడీపీ మహానాడు ప్రాంగణంలో ఓ 'బుల్లెట్ అందరినీ ఆకట్టుకుంది. గంగాధరనెల్లూరు మండలం పాతపాళ్యం పంచాయతీ వేణు గోపాలపురానికి చెందిన టీడీపీ యువనేత సుధాకర్ నాయుడు ఈ బుల్లెట్‌పై మహానాడు ప్రాంగణానికి చేరుకున్నాడు. ఈ బుల్లెట్‌ను చూసిన ప్రభుత్వ విప్ థామస్ కూడా దీన్ని కొంత దూరం నడుపుతూ సందడి చేశారు. బుల్లెట్ ముందుభాగంలో పసుపు కలర్ పెయింటింగ్ వేసిన సైకిల్‌ను అమర్చారు. దానికి మధ్యలో ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తోపాటు ఎమ్మెల్యేలు థామస్, జగన్మోహన్, మురళీ మోహన్, పలువురు టీడీపీ నాయకులు ఫొటోలు ఏర్పాటు చేసి ఉన్నారు.



బుల్లెట్‌ను నడుపుతున్న ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్

4నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్ నాల్గవ తేదీ నుంచి వేరుశనగ విత్తనకాయల పంపిణీ చేపట్టనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో ఏడీఏలతో పలు అంశాలపై సమీక్షించారు. వేరుశనగ విత్తనకాయల పంపిణీ, డ్రోన్ల అందజేత, భూసార పరీక్షలు, పంటల సాగు, యోగా అంశాలపై సమీక్షించారు. భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగు చేసేలా చూడాలని సూచించారు. జూన్ 9, 10, 11 తేదీల్లో ప్రతి మండలంలోనూ రైతులతో యోగాసనాలు వేయించి, యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించాలని చెప్పారు. సమావేశంలో చిత్తూరు, నగరి, పలమనేరు, పుంగనూరు ఏడీఏలు ఉమ, సౌభాగ్యలక్ష్మి, గీతాకుమారి, శివకుమార్ పాల్గొన్నారు.



పెనుమూరులో గోడౌన్‌కు చేరిన వేరుశనగ విత్తనాలు

ఇక భూ రికార్డులు పక్కా!



కుప్పం మున్సిపాలిటీలోని ఓ ప్రాంతానికి సంబంధించిన ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్

'నక్ష'తో ఖచ్చితమైన పట్టణ ప్రణాళిక ● కుప్పం పురపాలక సంఘంలో జోరుగా సర్వే

కుప్పం, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో ఆస్తుల వివాదాలకు ఇక చోటు లేకుండా పోనుంది. భూ రికార్డుల రిజిటలైజేషన్‌తో పక్కాగా ప్రజలకు వారివారి ఆస్తులమీద హక్కు దక్కనుంది. నక్ష సర్వేతో ఇకమీదట భూమి రికార్డులు పారదర్శకంగా అందరికీ అందుబాటులోకి రానున్నాయి. కుప్పం మున్సిపాలిటీలో ఈ సర్వే ప్రస్తుతం జోరుగా సాగుతోంది.

నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వ్ ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్ష) సర్వే ప్రాజెక్టుకోసం కేంద్ర ప్రభుత్వం దేశంలోని 150 మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను ఎంపిక చేసింది. మన రాష్ట్రంలో 10 ఎంపికయ్యాయి. ఇందులో కుప్పం మున్సిపాలిటీ ఒకటి.ప్రస్తుతం కుప్పంతో పాటు అనంతపురం, ఒంగోలు పట్టణాల్లో నక్ష సర్వే కొనసాగుతోంది. ఇక కుప్పం పురపాలక సంఘం విషయానికి వస్తే మొత్తం 34 చదరపు కిలోమీటర్ల వైశాల్యం మున్సిపాలిటీ పరిధిలో ఉంది. ఇందులో ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేటు ఆస్తులు కలిపి సుమారు 6 వేల దాకా ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నివాస గృహాలు 13 వేలున్నాయి. కుప్పం పురపాలక సంఘంలో డ్రోన్ సర్వే ఇప్పటికే పూర్తయింది. మున్సిపాలిటీ పరిధిలో ఉండే భూమి మొత్తాన్ని ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్‌గా రూపొందించారు ఈ సర్వే ద్వారా ఇంకా ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎఫ్‌ఎంబీ) తయారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం నక్ష సర్వే గ్రౌండ్ ట్రూథింగ్ స్టేజ్‌లో ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్తుల సర్వేనే ప్రారంభించారు.

నక్ష సర్వే లక్ష్యమంటున్నారు అధికారులు. నక్ష సర్వే ద్వారా ముందుగా పురపాలక సంఘం పరిధిలోని మొత్తం భూ భాగాన్ని డ్రోన్ల ద్వారా ఆర్థో రెక్టిఫైల్ ఇమేజెస్‌గా రూపొందిస్తారు. అనంతరం ఈ ఇమేజ్‌ఎను అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులను పక్కాగా అంచనా వేసి ఎఫ్‌ఎంబీ రూపొందిస్తారు. దీన్ని రూపొందించే ముందు ప్రజలకు నోటీసులు ఇస్తారు.ఆస్తుల హక్కు పత్రాలను సమర్పిస్తే, దాని ప్రకారం సర్వే కూడా చేస్తారు. ఏదైనా తేడాలుంటే అప్పటికప్పుడు పరిష్కరిస్తారు. దీనికి ముందు రోవర్ల ద్వారా పక్కా కొలతలు తీస్తారు. భూముల రికార్డులను ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా భద్రపరచడానికి, ఆస్తులపై పక్కా హక్కును ప్రజలకు దఖలు పరచడానికి మాత్రమే నక్ష సర్వే ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. సర్వే ఆఫ్ ఇండియా దిశానిర్దేశకత్వంలో కుప్పం మున్సిపాలిటీలో ఫిబ్రవరి నెలలో మొదలైన నక్ష సర్వేని ఈ ఏడాదిలోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది.



కుప్పం మున్సిపాలిటీలో నక్ష సర్వే పనిలో ఉన్న సిబ్బంది

నక్ష సర్వే అంటే ఏమిటి?

నక్ష సర్వే అంటే అత్యాధునిక సర్వే పద్ధతులను ఉపయోగించి, ఎవరి భూమి మీద హక్కును వారికి పక్కాగా ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా దఖలుపరచడం. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు సంబంధించిన ఆస్తులను పక్కాగా కొలతలు వేసి, ఎఫ్‌ఎంబీలు రూపొందించడమే

నక్ష సర్వేపై అపోహలు వద్దు



నక్ష సర్వేపైన అపోహలు పెట్టుకోవద్దు. మీ ఆస్తులను పక్కాగా డిజిటలైజేషన్ చేసి పట్టాలు ఇవ్వడానికే ఈ సర్వే జరుగుతోంది. ఆన్‌లైన్‌లో పారదర్శకంగా ఆయా ఆస్తుల వివరాలు యజమానుల పేరుతో సహా నమోదవుతాయి. నక్ష సర్వే అంటే ప్రజల ఆస్తుల డిజిటలైజేషన్ మాత్రమే. ఆస్తి పన్ను పెంచడానికో ఆస్తులను లాక్కోవడానికో ఈ సర్వే జరగడంలేదు. సర్వే కోసం తమ వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలి.

\- కమిషనర్ శ్రీనివాసరావు

27 మండలాల్లో 'పొలంబడి'

చిత్తూరు సెంట్రల్, మే 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జూన్ మొదటి వారం నుంచి జిల్లాలోని 27 మండలాల్లో పొలంబడి కార్యక్రమం చేపట్టనున్నారు. రైతులు సాగు చేసే పంటలు, వాడుతున్న ఎరువుల సాంద్రత, భూసార పరీక్షలు చేస్తారు. సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటలకు ప్రాధాన్యం ఇస్తూ ఆ రైతుకు ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ఇస్తారు. డివిజన్‌కు ఒకటి చొప్పున ఉండే ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ కింద రైతును నమోదు చేస్తారు. ఆ రైతు తాను పండించిన పంటను గిట్టుబాటు ధరలకు ఇక్కడ విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది.

'పీఎం సూర్యఘర్'లో బీసీలకు రూ.20వేల అదనపు సబ్సిడీ

చిత్తూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంలో ఎస్సీ, ఎస్టీలను మినహాయించి ఇప్పటికే అన్నివర్గాలకు 40శాతం సబ్సిడీతో సోలార్ ప్యానళ్లు ఇస్తున్నారు. దీనికి అదనంగా మరో రూ20వేల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. గురువారం విజయవాడ నుంచి సీఎండీలతో కలిసి అన్ని జిల్లాల ఎస్ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ నెలలోపు రాష్ట్ర వ్యాప్తంగా మరో లక్ష సర్వీసులు ఏర్పాటు చేయాలని టార్గెట్ నిర్ణయించామన్నారు. జిల్లాలకు త్వరలో టార్గెట్ ఇస్తామన్నారు.

డీసీసీబీ నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస రాజశేఖరరెడ్డి నియమితులయ్యారు.ఈయన పదవీ బాధ్యతలు స్వీకరించిన తేది నుంచి 2025 జూన్ 26వ తేది వరకు లేదా ఎన్నికలు జరిగేంతవరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది.డీసీసీబీకి 2006లో జరిగిన ఎన్నికల్లో అమాస రాజశేఖరరెడ్డి చైర్మన్‌గా పోటీ చేసి గెలుపొందారు.2011 వరకు ఆ పదవిలో కొనసాగిన ఆయన తరువాత జరిగిన ఎన్నికల్లో కూడా చైర్మన్‌గా ఎన్నికై మరో ఐదేళ్ల పాటు కొనసాగారు. అప్పటి ప్రభుత్వం సహకార సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో 2019 వరకు అమాస రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని పాలకవర్గమే కొనసాగింది.2019లో వైసీపీ ప్రభుత్వం ఈ పాలకవర్గాన్ని రాజీనామా చేయించారు.దీంతో వడమాలపేట మండలం కాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి (సింగిల్‌విండో) అధ్యక్షుడిగా కొనసాగారు.కాగా ప్రస్తుతం డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ విద్యాధరి కొనసాగుతున్నారు.త్వరలోనే అమాస రాజశేఖర రెడ్డి బాధ్యతలు చేపట్టబోతున్నారు.



అమాస రాజశేఖర రెడ్డి

నేటి 'ప్రజాదర్బార్' రద్దు

చిత్తూరు సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

టీచర్ల బదిలీల, పదోన్నతుల్లో అభ్యంతరాలు

- డీఈవో పట్ల ఫ్యాప్టో నేత అమర్యాదకర ప్రవర్తన
- సమస్యకు కారణమంటూ జీడీ నెల్లూరు ఎస్జీటీపై కమిషనర్‌కు డీఈవో ఫిర్యాదు

చిత్తూరు సెంట్రల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఉత్పన్నమైన సమస్యలు, వాటి పరిష్కార వ్యవహారం గురువారం డీఈవో వరలక్ష్మి, ఫ్యాప్టో నాయకుల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది.పాఠశాల విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఈనెల 21న టీచర్ల బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి చిత్తూరు డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ సందర్భంగా టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఫ్యాప్టో నాయకులు లేవనెత్తిన సమస్యల్లో చాలావరకూ డీఈవో వరలక్ష్మి పరిష్కరించారు.సర్వీసు అంశాలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ తయారీ క్రమంలో ఏపీ స్టేట్ సబార్డినేట్ సర్వీసు 33ఏ ప్రకారం ప్రస్తుత క్యాడర్, పీరియడ్, డేట్ ఆఫ్ బర్త్, మేల్, ఫీమేల్ సీనియారిటీ, 2021 బదిలీల్లో అర్హత సాధించి, రీఆపోర్షన్(షిఫ్టెడ్)కు గురైన టీచర్లకు పాత స్టేషన్ పాయింట్లు వర్తింపజేయాలనే దానిపై డీఈవోకు, ఫ్యాప్టో సంఘం నేతలకు మధ్య వాదనలు చోటు చేసుకున్నాయి. ఇతర జిల్లాల్లో పాటిస్తున్న విధానమే ఇక్కడా అమలు చేయాలని ఫ్యాప్టో నాయకుల పట్టుబడుతూ డీఈవో వరలక్ష్మిని చుట్టుముట్టారు.పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నుంచి వివరణ తీసుకుని సమాధానం ఇస్తామని డీఈవో చెబుతున్నా తిరుపతి జిల్లా ఫ్యాప్టో నాయకుడు,రామచంద్రాపురం మండలం అనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పీడీ సురేష్ ఆమెను ఏక వచనంతో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఇక్కడే నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించడంతో పక్కనే ఉన్న చిత్తూరు జిల్లా ఫ్యాప్టో నాయకులు అవాక్కయ్యారు.మహిళ అని కూడా చూడకుండా అమర్యాదగా ప్రవర్తించడాన్ని డీఈవో కార్యాలయ సిబ్బంది తీవ్రంగా ఖండించారు. సమస్య జటిలం కావడానికి జీడీ నెల్లూరు మండలం అగ్రహారం ఎంపీయూపీఎస్ పాఠశాల ఎస్జీటీ పి.విజయ్‌కుమార్ కారణమని విద్యాశాఖ అధికారులు కమిషనర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు.మూడు రోజులుగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతూ పలు అంశాలపై ఉపాధ్యాయ సంఘాల నేతలను రెచ్చగొడుతున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా బదిలీలకు సంబంధించి ఫ్యాప్టో నాయకులు లేవనెత్తిన అంశాల్లో ఒకటైన, ఉపాధ్యాయుల బదిలీల క్రమంలో 2021 అర్హత సాధించిన వారికి రీఅపోర్షన్ కింద 2025లో పాత స్టేషన్ పాయింట్లు వర్తిస్తాయని డీఈవో వరలక్ష్మి వివరణ ఇచ్చారు. ఫ్యాప్టో నాయకులు జీవీ రమణ, మణిగండన్, మునీర్ అహ్మద్, మునాఫ్, గోపీనాథ్, సోమశేఖర నాయుడు, మదనమోహన్‌రెడ్డి, చెంగల్రాయమందడి తదితరులు పాల్గొన్నారు.



డీఈవో వరలక్ష్మిని చుట్టుముట్టిన ఫ్యాప్టో నాయకులు

167మంది హెచ్ఎంల బదిలీ

ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ముగిసింది. జిల్లా పరిషత్ యాజమాన్యంలో 155 మంది, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదుగురు, మున్సిపాలిటీల్లోని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు ఏడుగురు బదిలీ అయ్యారు.

ఎస్ఏలకు మొదలైన పదోన్నతి కౌన్సెలింగ్

స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) నుంచి గ్రేడ్-2 హెచ్ఎంల పదోన్నతి కౌన్సెలింగ్ గురువారం చిత్తూరులో మొదలైంది. జడ్పీ యాజమాన్యంలో 155, మున్సిపల్ కార్పొరేషన్లలో ఐదు, మున్సిపాలిటీల్లో ఐదు పోస్టులకు గాను 1:3 రేషియోలో 500 మంది ఎస్ఏలను పిలిచారు.

విరివిగా మొక్కలు నాటుదాం: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమౌతున్న దృష్ట్యా జిల్లావ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటుదామని, అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో డీఎఫ్‌వో భరణి, సామాజిక అటవీశాఖ అధికారి జ్ఞాన ప్రకాష్, డ్వామా పీడీ రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణలతో కలిసి డ్వామా ఏపీడీలు, వ్యవసాయశాఖ ఏడీలతో సమీక్షించారు. రానున్న రెండు నెలల్లో ప్రభుత్వ భూముల్లో రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మండల, గ్రామస్థాయి రైతులతో మాట్లాడి వారికి అవసరమైన వివిధ రకాల మొక్కల పంపిణీకి వివరాలు సిద్ధం చేయాలని చెప్పారు. మండల పరిధిలో రెండు లేదా మూడు చోట్ల పంపిణీ కేంద్రాలను గుర్తించాలన్నారు.



ఆటాడుకుందామా!

గురువారం చల్లని మధ్యాహ్నం వేళ
తిరుపతి జూపార్క్‌లో కనిపించిన దృశ్యాలు

- ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి

మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సు రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో చూడాలని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు. రీ వాల్యుయేషన్ కోసం జూన్ 9 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

సంస్కృత వర్సిటీలో దూరవిద్యకు దరఖాస్తుల ఆహ్వానం

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం దూరవిద్యా విభాగంలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమో, ప్రాక్ శాస్త్రి కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 8 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర సమాచారం కోసం.. 94402 26562 నెంబరులో సంప్రదించాలని ఆ వర్సిటీ దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ రంగనాథ్ కోరారు.

ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఎన్‌బీఏ గుర్తింపు



ఎన్‌బీఏ గుర్తింపు ధ్రువీకరణ పత్రంతో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహిస్తున్న పలు కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఇంజనీరింగ్ కాలేజీ పాటిస్తున్న బోధన, ఫలితాలు, సదుపాయాలు, ప్రమాణాలను ఈ నెల 7 నుంచీ మూడు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ గుర్తింపు ప్రకటించారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాల ప్రగతిని ఎన్‌బీఏ బృందం అధ్యయనం చేసి ఈ గుర్తింపు ప్రకటించింది. దీనిపై ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్ వెంకట్రామయ్య, డీన్ దామోదరరెడ్డి, ప్రొఫెసర్ రమాశ్రీ, ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఇంతకీ ఏం జరిగింది?

- నాయుడుపేట లాడ్జీలో ఇద్దరి మృతి
- యువకుడి మెడ కోసి ఉండటంతో అనుమానాలు
- యువతి ఉరేసుకుని ఆత్మహత్య
- అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు



లాడ్జీవద్ద రోదిస్తున్న శిరీష కుటుంబీకులు

నాయుడుపేట టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. ఆమె భర్తతో విడిపోయింది. అతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాంటిది.. మణి(35), శిరీష (25) మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఏం జరిగిందో ఏమోగానీ.. గురువారం నాయుడుపేటలోని లాడ్జీలో ఇద్దరూ మృతిచెందారు. అతడి గొంతు కోసి ఉండగా.. ఆమె ఉరేసుకుంది. అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం గ్రామానికి చెందిన మణికి పెళ్లయింది. భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇక, శిరీషను చిన్నప్పుడే ఆమె తల్లి విజయమ్మ కుప్పరెడ్డిపాళెంలో నాయనమ్మ గురవమ్మ, లాజరస్ దంపతులకు అప్పగించింది. వాళ్లు పెంచి శ్రీకాళహస్తి సమీపంలోని సమీప బంధువుకు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలం తరువాత ఆమె విడాకులు తీసుకొని కుప్పరెడ్డిపాళెంలో నాయనమ్మ దగ్గర ఉంటుంది. ఈ క్రమంలో మణితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీంతో మణి ఇంట్లో గొడవలు రేగాయి. కొద్ది రోజుల కిందట అతడి భార్య పుట్టింటికి అలిగివెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో మణి, శిరీష నాయుడుపేట బస్టాండు సమీపంలోని ఓ లాడ్జీలో గదిని అద్దెకు తీసుకున్నారు. గురువారం ఉదయం 8.30 గంటల సమయంలోనూ లాడ్జీ సిబ్బందితో మాట్లాడారు. ఆ తర్వాత గదిలోకి వెళ్లిన వీరు.. ఎంతసేపటికీ బయటకు రాలేదు. అనుమానం వచ్చిన సిబ్బంది కిటికిలో నుంచి చూడగా శిరీష ఉరేసుకుని.. మణి గొంతుకోసుకొని అధిక రక్తస్రావంతో పడి ఉండటాన్ని గుర్తించారు. వీరి సమాచారంతో డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్ఐ నాగలక్ష్మి మృతదేహాలను పరిశీలించారు. అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేశారు.

ఎన్నో అనుమానాలు?

మణి గొంతు కత్తితో చాలా లోతుగా తెగిఉండటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనే కోసుకుని ఆత్మహత్య చేసుకొని ఉంటే అంతలోతుగా తెగి ఉండదని భావిస్తున్నారు. వాష్ బేసిన్లో రక్తపు మరకలు ఉండటంతో.. ఇక్కడ చేతులు కడిగి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఉరేసుకుని చనిపోయిన శిరీష చేతికీ రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించారు. దీంతో వీరిద్దరి మధ్య ఏం జరిగిందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఆ గదికి గడియ వేసుండటంతో మూడో వ్యక్తి వచ్చిపోయే అవకాశం లేదు. అనుమానాస్పద స్థితిలో మృతిగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణకు 'యోగా'





మంగళం/తిరుపతి(క్రీడలు/కలెక్టరేట్), మే 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరు యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని, యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం తిరుపతిలోని ఎస్వీ జూపార్కు వద్ద యోగా శిక్షణ నిర్వహించారు. ప్రతి ఒక్కరు మరో నలుగురితో యోగా చేయించాలన్నారు. ఇప్పటి వరకు గుర్తించి మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఈనెలాఖరు వరకు శిక్షణ కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ శుభంబన్సల్, జూ క్యూరేటర్ సెల్వం, డీఎఫ్‌వో వివేక్ వివిధ విభాగాల అధికారులు రామ్మోహన్, విక్రమ్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణనాయక్, జనార్దన్‌రెడ్డి, చరణ్‌తేజ్ రెడ్డి, సిబ్బంది యోగాసనాలు వేశారు. సాయంత్రం కలెక్టర్, జేసీ, కమిషనర్ మౌర్య యోగాంధ్ర నిర్వహణ, యోగాంధ్ర యాప్‌లో నమోదుపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. యాప్‌లో పది లక్షలమంది నమోదుకు లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 1.30 లక్షలు మాత్రమే నమోదవడం అసంతృప్తి వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), మే 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువును మరో మూడు నెలలు పొడిగించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనున్న నేపథ్యంలో ఆగస్టు 31 వరకు పొడిగించనున్నట్లు పేర్కొన్నారు. మీడియా సంస్థలో జర్నలిస్టుల వివరాలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో త్వరగా అందజేయాలన్నారు.





సభలో అమ్మాయిల ఉత్సాహం



మహానాడు వేదిక




సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం



కలెక్టర్‌కు కృతజ్ఞతలు


కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో జంతు సంరక్షణ కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో శాశ్వత ప్రాతిపదికన వీధి కుక్కల నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై జంతు సంరక్షణ కమిటీ సభ్యులు గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కమిటీ సభ్యులు పి.మాలతి, పి.మంజునాథ్ రెడ్డి, ఆర్తి, విజయ శిరీష కలిశారు. వీధికుక్కలకు ఆశ్రయం లేకపోవడం, ఆహారం, వైద్య సేవలు వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తేగా తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

కాణిపాకంలో ఆవాహిత దేవతారాధన


లఘు పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

ఐరాల(కాణిపాకం), మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న వీరాంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, అష్ట బంధనం, మహాకుంభాభిషేకంలో భాగంగా ఆవాహిత దేవతారాధనను అర్చక, పండితులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఆలయ పునఃనిర్మాణ దాత అనిల్‌కుమార్ కుటుంబీకులు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం మహాకుంభాభిషేకం జరగనుంది.

అక్రిడిటేషన్ కార్డుల గడువు మూడు నెలల పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును జూన్ ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీవరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్, డీఎంఏసీ చైర్మన్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు శనివారంతో ముగియనున్న సందర్భంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

లేకుంటే 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్న రైతులు


మీడియాతో మాట్లాడుతున్న మామిడి రైతులు

చిత్తూరు సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మామిడికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ఇటీవల కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మామిడి గుజ్జుపరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి.. రైతులవద్ద గిట్టుబాటు ధరతో మామిడి కాయలు కొనుగోలు చేయాలని చెప్పారన్నారు. అయినా ఇంతవరకు గుజ్జు పరిశ్రమలవారు రైతుల వద్ద కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. ఇంకొన్ని రోజులు ఇలాగే ఉంటే తోటల్లోనే కాయలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. తోతాపురి రకానికి కిలోకు కనీసం రూ.15 నుంచి రూ.20 ఇవ్వాలని కోరారు. సీఎం చంద్రబాబు స్పందించి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, లేకుంటే శరణ్యమని వాపోయారు. ప్రభుత్వం స్పందించకపోతే వచ్చేనెల 2వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులు ప్రకాష్, హరిబాబు నాయుడు, బాలాజీనాయుడు, రఘునాథ నాయుడు, జయచంద్రనాయుడు, లోకనాథ నాయుడు, దేవరాజులు, చిన్నబ్బ రెడ్డి, శేషాద్రి రెడ్డి, లోక తదితరులు పాల్గొన్నారు.

హీరో శ్రీకాంత్ కుటుంబీకుల నవగ్రహ శాంతిపూజలు



శ్రీకాళహస్తి, మే 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణం సన్నిధివీధిలోని రాఘవేంద్ర స్వామి మఠంలో హీరో శ్రీకాంత్ కుటుంబ సమేతంగా గురువారం నవగ్రహ శాంతి పూజలు చేయించుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు. కాగా, ముక్కంటి ఆలయంలో పనిచేసేకొందరు అర్చకులు, పండితులు శ్రీకాంత్‌కు ప్రైవేటు పూజలు నిర్వహించడం, ఆ ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసుకోవడం విమర్శలకు తావిచ్చింది.

తిరుమలలో శ్రియ



తిరుమల, మే 29(ఆంధ్రజ్యోతి):హీరోయిన్ శ్రియ గురువారం వేకువజామున సుప్రభాతసేవలో పాలొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల పలువురు అభిమానులు ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారిని, శ్రీకాళహస్తీశ్వరుడిని కూడా శ్రియ దర్శించుకున్నారు.


కడపకు బయల్దేరే ముందు చిత్తూరులో కేక్ కట్ చేసిన టీడీపీ నాయకులు

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

చిత్తూరు సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడులో చివరి రోజున నిర్వహించిన బహిరంగ సభకు జిల్లా నుంచి టీడీపీ శ్రేణులు భారీ స్థాయిలో తరలివెళ్లాయి. చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాల మైదానం నుంచి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నాయకులు, కార్యకర్తలు కడపకు పలు వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, గుడిపాల మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడులు వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. బాలాజి నాయుడు, హేమాద్రి నాయుడు, మధు నాయుడు, అనిల్, మోహన్ రాజ్, రాజశేఖర్, శశికర్ బాబు, మేషాక్, జగదీశ్వర్ నాయుడు, శ్యామ్, రఘు తదితరులు పాల్గొన్నారు.


రెడ్డివారిపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి చెట్లు - తొక్కివేసిన టమోటా తోట

ఏనుగుల గుంపు స్వైరవిహారం

సోమల, మే 29 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పేటూరు పంచాయతీలోని రెడ్డివారిపల్లె గ్రామ సమీపంలో ఏనుగుల గుంపు టమోటా, మామిడి తోటల్లో స్వైరవిహారం చేశాయి. బుధవారం పగలే రాంపల్లె బీట్ పరిధిలో ఏనుగులు సంచరించడంతో రైతులు భయందోళనచెందారు. రాంపల్లె, కొత్తూరు, పత్రపల్లె, ఎగువ కొత్తూరు రైతులు, అటవీ అధికారులు టపాసులు పేల్చి రెడ్డివారిపల్లె వైపు మళ్లించారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి రెడ్డివారిపల్లె సమీపంలోని ఎలకలోని కుంట వద్ద రైతులు అనిల్, ఆనందరెడ్డికి చెందిన టమోటా, మామిడి తోటల్లో తిరగాడి పంటలను తొక్కివేశాయి. ఏనుగుల ఘీంకారాలతో పొలాల వద్ద ఉన్న రైతులు భయంతో గ్రామాకి చేరుకున్నారు. చిన్న ఉప్పరపల్లె, ఆవులపల్లె పంచాయతీ అటవీ సమీప టమోటా తోటల్లో కోతలు కోయడానికి రైతులు వెనకాడుతున్నారు. ఏ సమయంలో ఏనుగులు వస్తాయో తెలియక రైతులు భయాందోళనచెందుతున్నారు. కొందరు రైతులు జట్లుగా ఏర్పడి పొలాల వద్ద టపాసులు పేల్చుకుంటూ, డప్పుల శబ్దం చేస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.


ఏనుగులు విరిచిన మామిడి చెట్లు - తిని తొక్కేసిన మామిడి కాయలు - తొక్కేసిన వరి పంటపంట

పొలాలను ధ్వంసం చేసిన గజరాజులు

చౌడేపల్లె, మే29(ఆంధ్రజ్యోతి): పంట పొలాలను ఏనుగులు గుంపు ధ్వంసం చేశాయి. బుధవారం రాత్రి 14 ఏనుగుల గుంపు మండలంలోని చుక్కావారిపల్లె, పందిళ్లపల్లె, తుప్పిరెడ్డిపల్లెలలోని రైతుల పంటలలో స్వైర విహారం చేశాయి. రైతు శ్రీనివాసురెడ్డి టమోటా పంటను ధ్వంసం చేశాయి. అలాగే ఎం. శ్రీనివాసులురెడ్డి, గంగిరెడ్డి మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు విరిచేశాయి. కాయలు నేలరాల్చి తిన్నంత తినేశాయి. గణపతి వరి పొలాన్ని తొక్కేశాయి. ఎఫ్ఆర్‌వో శ్రీరాములు, ఎఫ్ఎస్‌వో బాలసుబ్రహ్మణ్యం, ఎఫ్‌బీవో కిరణ్‌లు డప్పులు వాయించి ఏనుగులను చుక్కావారిపల్లె మీదుగా ఉప్పరపల్లెలోని పెద్ద వంక అడవిలోకి తరిమేశారు.


ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

జడ్పీలో 27 మంది ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్(జడ్పీ)లో ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభమైంది. సీఈవో రవికుమార్ నాయుడు 27 మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో తొమ్మిది మంది ఏవోలుండగా నలుగురికి ఐదేళ్లు పూర్తవగా, ఐదుగురు రిక్వెస్ట్‌పై బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. అలాగే 18 మంది సీనియర్ అసిస్టెంట్లలో తొమ్మిది మందికి ఐదేళ్లు పూర్తవగా, తొమ్మిది మంది రిక్వెస్ట్‌పై బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. నేడు జూనియర్ అసిస్టెంట్లకు, టైపిస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో తెలిపారు.

కాలినడక భక్తుల భద్రతపై టీటీడీ మరో ముందడుగు

ఏడో మైలు వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు నిర్ణయం ● సోలార్ లైవ్ కెమెరాలకు చిక్కిన పిల్లలతో చిరుత, ఎలుగుబంటి


తిరుమల నడకమార్గంలో ఏడో మైలు వద్ద ఏర్పాటు చేసిన సోలార్ లైవ్ కెమెరాకు చిక్కిన రెండు పిల్లలతో ఎలుగుబంటి - సోలార్ కెమెరాకు పిల్లతో చిక్కిన చిరుత

మంగళం, మే 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తుల భద్రతపై టీటీడీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. అలిపిరి- తిరుమల నడక మార్గంలోని ఏడో మైలు సమీప ప్రాంతాల్లో చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా ఉందని గుర్తించింది. అందుకని ఇక్కడే శాశ్వత ప్రతిపాదికన కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు సిద్ధమైంది. గతంలో అలిపిరి నుంచి తిరుమలకు వెళ్లే ఈ నడకమార్గంలో భక్తులపై చిరుతలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఒక చిన్నారి తీవ్రంగా గాయపడగా, లక్షిత అనే బాలిక ప్రాణాలు కోల్పోయింది. అప్పట్లో కాలినడకన వెళ్లే భక్తులకు టీటీడీ కర్రలూ అందించింది. సాయంత్రం 6గంటల పైన నడకమార్గాన్ని మూసివేసింది. బోన్లు ఏర్పాటు చేసి నడకదారికి సమీపంలో వచ్చే చిరుతలను బంధించి కొన్నింటిని సుదూర అటవీప్రాంతాల్లో వదిలిపెట్టగా, మరికొన్నింటిని ఎస్వీ జూపార్కుకు తరలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 26 సోలార్ లైవ్ కెమెరాలనూ ఆ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లో చిరుత, దాని పిల్ల చిక్కాయి. మరో కెమెరాలో రెండు పిల్లలతో ఉన్న ఎలుగుబంటి దృశ్యం రికార్డు అయింది. ఈ ప్రాంతంలో తరచూ ఎలుగుబంట్లు, చిరుతలు రాత్రి వేళలో ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను ఏడో మైలు వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

కంట్రోల్ రూమ్‌లోనే మానిటర్, రెస్క్యూటీం

ఇప్పటి వరకు నడక మార్గంలో రెస్క్యూ టీంగా కొందరు ఉంటున్నారు. ఎక్కడైనా చిరుత, ఎలుగుబంట్లు ఉన్నట్లుగాని, నడక మార్గానికి దగ్గరగా వచ్చినట్లు గానీ తిరుపతిలోని బయోట్రిమ్ కార్యాలయానికి అందే సమాచారంతో వీరు అక్కడికి చేరుకుని వాటిని అడవిలోకి తరిమేలా చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు కంట్రోల్ రూమ్ ఏర్పాటైతే ప్రభుత్వ అటవీశాఖలోని ఇద్దరు బయాలజిస్టులు, పది మంది సిబ్బంది, టీటీడీ అటవీశాఖ, విజిలెన్సు సిబ్బంది దాదాపు 30మంది ఇక్కడే ఉంటారు. కంట్రోల్ రూమ్‌లోని మానిటర్‌లో ఉన్న కెమెరాల ద్వారా వన్యప్రాణుల కదలికలను వీరు ఎప్పటికప్పుడు గమనిస్తూ చర్యలు తీసుకుంటారు. గతంలో ఇక్కడ ఎలివేటెడ్ పాస్ ఏర్పాటు చేస్తే మంచిదన్న నిపుణుల అభిప్రాయాలను మాత్రం ప్రస్తుతానికి టీటీడీ పక్కన పెట్టిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


శ్రీవారి మెట్టు మార్గాన నడిచి వస్తున్న భక్తులు - తిరుమలలో ఆలయం ముందు..

తిరుమలలో పెరిగిన రద్దీ

తిరుమల, మే 29(ఆంధ్రజ్యోతి):వేసవి సెలవులు చివరికి చేరుకోవడంతో తిరుమలకొండకు భక్తులు పోటెత్తారు. గురువారం నుంచే ఎటు చూసినా జనం కనిపిస్తున్నారు. క్యూలలోని సర్వదర్శన భక్తులకు 16 గంటల దర్శన సమయం పడుతోంది. శ్రీవారిపాదాలు, అలిపిరి కాలినడకదారులు సైతం రద్దీగా మారాయి.

ప్రభుత్వ బడుల్లో పనిచేసే ఆయాలకు పెండింగ్ జీతాలివ్వండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఏఐటీయూసీ నేతల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.నాగరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 2021 వరకు ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 350 మంది ఆయాలకు 36 నెలల జీతాలు ఇవ్వలేదని చెప్పారు. వేసవి సెలవులు ప్రకటించినా పాఠశాలలకు ఆయాలు వెళ్తున్న దృష్ట్యా పూర్తి జీతం ఇవ్వాలని కోరారు. అలాగే వారికి గుర్తింపు కార్డులు, యూనిఫాం అందించాలన్నారు. కలెక్టర్ అప్పటికప్పుడే స్పందించి డీఈవోతో సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామరై, ఆయాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశ, జయకుమారి, హసీన, కోకిల పాల్గొన్నారు.


మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి.పగలు....ఒక్కోసారి సాయంత్రం పూట వున్నట్లుండి మబ్బులు కమ్ముకుంటాయి. భారీవర్షం వచ్చే సూచనలు కన్పిస్తాయి. అయితే వర్షం పడదు.సాయం సంధ్యవేళ నీలి మేఘాలు మాత్రం ప్రత్యేకంగా దర్శనమిస్తుంటాయి.

2వేల మంది వైద్య సిబ్బందితో నేడు యోగా

చిత్తూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిత్తూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది వైద్యసిబ్బందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగామ్ ఆఫీసర్ల నుంచి వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొనాలని ఆదేశాలిచ్చారు. ఉదయం ఆరు గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

కొనసాగుతున్న జంట ఏనుగుల విధ్వంసం

అరటి, మామిడి తోటలకు నష్టం


ఎస్.గొల్లపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి కొమ్మలు, నేలరాలిన మామిడికాయలు

రామకుప్పం, మే 29 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఎస్.గొల్లపల్లె అటవీ శివారు ప్రాంతంలో పంట పొలాలపై జంట ఏనుగుల విధ్వంసం కొనసాగుతోంది. మొన్న నారాయణపురం తాండా.., నిన్న ననియాల తాండా.., నేడు ఎస్.గొల్లపల్లె.. ఇలా రోజూ ఏదో ఓ చోట నెలరోజులుగా పంటలపై పడి ఏనుగులు విధ్వంసం సృష్టిస్తూనే ఉన్నాయి. తాజాగా బుధవారం రాత్రి ఎస్.గొల్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న పలువురు రైతులకు చెందిన అరటి, మామిడి తోటలోకి జొరబడ్డాయి. కాయలను తిన్నాయి. చెట్లను విరిచేశాయి. తొలుత నాగభూషణ్‌రెడ్డి, గంట్లప్పగౌడు, రామలక్ష్మి, విశ్వనాథ్, భక్తవత్సల రెడ్డిలకు చెందిన మామిడి తోటలోని చెట్లను విరిచేశాయి. కాయలను నేలరాల్చాయి. అక్కడి నుంచి మురుగేష్‌గౌడు, జయరామప్పలకు చెందిన అరటి తోటలోకి వెళ్లి అరటికాయలు తిని చెట్లను విరిచేశాయి. పలు రకాల వ్యవసాయ పరికాలను తొక్కేశాయి. అటవీ అధికారులు గజదాడుల నుంచి పంటలను రక్షించాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో గద్వాల్‌వాసి మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన జశ్వంత్

పుంగనూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో తెలంగాణ రాష్ట్రానికి చెందిన కార్మికుడొకరు మృతి చెందిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది.గద్వాల్ జిల్లా మనప్పాడు గ్రామానికి చెందిన వెంకట్రాయుడి కుమారుడు జశ్వంత్ హంద్రీనీవా పుంగనూరు బ్రాంచి కాలువ విస్తరణ పనుల్లో పాల్గొంటున్నాడు.ఇందుకు సంబంధించి గురువారం కంగానెల్లూరు సమీపంలో హంద్రీనీవా కాలువ వద్ద సర్వే జరగ్గా సర్వే స్టాంప్ పైనున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో విద్యుత్‌షాక్ తగిలిన జశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. జశ్వంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారు మృతి

గంగవరం,మే 29(ఆంధ్రజ్యోతి): బెంగళూరు- పలమనేరు రహదారిలోని గండ్రాజుపల్లె వద్ద కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు వైఎస్సార్ కాలనీకి చెందిన మొహమ్మద్ (61) సొంత పనిపై నంగలికి ద్విచక్రవాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొంది. మొహమ్మద్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాకశాస్త్ర వర్సిటీలో డీజీఆర్ ట్రైనీలకు వీడ్కోలు



రేణిగుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ పాకశాస్త్ర వర్సిటీలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీ సెటిల్మెంట్ (డీజీఆర్)లో శిక్షణ పొందిన వారికి కలెక్టర్ వెంకటేశ్వర్ వీడ్కోలు పలికారు. రేణిగుంట మండలం జిపాళ్యం పంచాయతీలోని విశ్వవిద్యాలయంలో అవుట్ గోయింగ్ బ్యాచ్‌కు గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వీరిని కలెక్టర్ అభినందించారు. వసతి, టూరిజం రంగంలో వారికి గొప్ప రెండవ కెరీర్‌ను కోరుకుంటున్నారన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ ఎం. తిరులోగ చందర్ పాక శాస్త్ర విద్యాయలం అందించే కోర్సులు, వసతి, టూరిజం పరిశ్రమలో విద్యార్థులకు అవకాశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అన్ని వంటశాలలు, ప్రయోగశాలను కలెక్టర్ సందర్శించి కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో పాక శాస్త్ర విశ్వవిద్యాలయం అధికారులు, సిబ్బంది శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి టోల్ గేట్ వసూళ్లు



ఏర్పేడు, మే 29(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని మేర్లపాక సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై శుక్రవారం నుంచి టోల్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. జాతీయ రహదారికి సంబంధించిన అధికారులు మూడు రోజులుగా ట్రయల్స్ వేశారు. కారుకు రూ.140, బస్సు, ట్రక్కులకు రూ.470 చొప్పున వసూలు చేయనున్నట్లు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ టోల్‌గేట్‌కు ఇరువైపులా 20 కిలోమీటర్ల మేరకు ఉన్న వైట్ బోర్డు వాహనదారులు నెలకు రూ.350 చెల్లించి పాస్ తీసుకోవాల్సి ఉంటుంది.

భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, మే29 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పలమనేరు ఆర్డీఓ పి.భవాని హెచ్చరించారు. గురువారం పలమనేరు డివిజన్ పరిధిలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ ఆక్టు-1994పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆర్డీవో ప్రసంగించారు. డివిజన్ పరిధిలో ప్రైవేటు నర్సింగ్ హోమ్స్‌వారు, ఆర్ఎంపీ, పీఎంపీ ప్రాక్టీషనర్స్ చట్టవ్యతిరేకంగా లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు, అబార్షన్‌లకు పాల్పడితే శిక్షలు తప్పవన్నారు. డివిజన్ స్థాయిలో లింగనిష్పత్తి సమాన స్థాయిలోకి తీసుకురావడానికి అధికారులు కృషిచేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళాసంఘాలు, క్షేత్ర స్థాయిలో అబార్షన్లు , బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు, జిల్లా అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి జయరాములు, కన్వీనర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, పలమనేరు డివిజన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, రేడి యాలజిస్టు, గైనకాలజిస్టు, చిన్నపిల్లల వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, ఎన్జీఓలు, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులు, సీహెచ్‌ఓలు, హెల్త్ ఎడ్యుకేటర్లు, సూపర్‌వైజర్‌లు హాజరయ్యారు.

మహానాడుకు తరలిన కుప్పం టీడీపీ శ్రేణులు



కుప్పం, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జరుగుతున్న మహానాడుకు కుప్పం నియోజక వర్గంచి ఆ పార్టీ శ్రేణులు గురువారం పెద్దయెత్తున తరలివెళ్లాయి. ముఖ్యంగా కుప్పం మండలం నుంచి మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పిలుపు మేరకు పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేకమైన బస్సుల్లో కడపకు బయలుదేరారు. అక్కడ గురువారం జరిగిన మహానాడు మహాసభలో పాల్గొని రాత్రికి తిరుగు ప్రయాణమయ్యారు.

ఒకటో తేదీన ఉచిత నేత్ర చికిత్సాశిబిరం

పలమనేరు, మే29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో జూన్ 1వ తేదీ ఆదివారం ఉచిత నేత్రచికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు ప్రభాకర్ తెలిపారు. ఈ శిబిరంలో చెన్నై శంకరనేత్రాలయ నేత్ర వైద్యులు మురళి నేత్రపరీక్షలు నిర్వహిస్తారని, ఆపరేషన్లు అవసరమైన వారికి చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని, చెన్నై వెళ్లిరావడానికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తారని తెలిపారు.

మహానాడుకు పలమనేరు పసుపుదళం



పలమనేరు, మే29 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండల తెలుగుయువత అధ్యక్షులు వెంకటమునిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పెద్దసంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగుయువత నాయకులు, కార్యకర్తలు కడపలో జరుగుతున్న మహానాడుకు ఆర్టీసీ బస్సులో తరలివెళ్లారు. పలమనేరు పట్టణ టీడీపీ అధ్యక్షులు ఆర్బీసీ కుట్టి ఆధ్వర్యంలోనూ అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మహానాడుకు వెళ్లారు.

మహానాడుకు పుంగనూరు పసుపు సేన



పుంగనూరు, మే29(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి పుంగనూరు పట్టణ, మండల స్థాయి నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. గురువారం బస్సులు, జీపులు, కార్లలో తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. గ్రామ స్థాయి నుంచి సామాన్యులు సహితం తరలిరావడంతో మదనపల్లె రోడ్డు తెలుగు తమ్ముళ్లతో కిక్కిరిసిపోయింది. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్, సీవీరెడ్డి, పోలీసుగిరి, శమీపతి, సుబ్రహ్మణ్యంరాజు, కృష్ణానాయక్, రామకృష్ణనాయక్, రామకృష్ణమరాజు, రామయ్య, గంగాధర్, గంగరాజు, కోలాట వెంకటరమణ, రాఘవ, ప్రసాద్, వేణు పాల్గొన్నారు.

6న శిథిలభవనాల తొలగింపు వేలం

బైరెడ్డిపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో శిథిలమైన రెండు వసతిగృహ భవనాలను తొలగించడానికి జూన్ 6వ తేదీ పాఠశాల ఆవరణలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శోభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు రూ.10వేలు ధరావత్తు, రూ.3వేలు ప్రవేశరుసుం చెల్లించాలని పేర్కొన్నారు. సంబంధిత డీడీలను ప్రిన్సిపాల్, ఏపీఆర్ స్కూల్, కమ్మనపల్లె పేరుమీద తీసి జూన్ 5వతేదీ లోపు పాఠశాలలో అంద జేయాలని వెల్లడించారు. వివరాలకు 8712625057 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

స్టాక్ పాయింట్‌కు చేరిన విద్యాసామగ్రి

సోమల, మే 29 (ఆంధ్రజ్యోతి): సోమల జడ్పీ హైస్కూల్‌కు విద్యాసామగ్రి చేరు కొన్నట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. మండలంలోని ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అచ్చుపుస్తకాలు, నోట్ పుస్త కాలు, డిక్షనరీ, బెల్టు, షూ, యూనిఫామ్ విద్యాశాఖ నుంచి స్టాక్ పాయింట్‌కు చేరుకున్నాయనితెలిపారు. పాఠశాలలు తెరవగానే ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని వివరించారు.

భారతంమిట్టలో మహాభారత యజ్ఞం ప్రారంభం

సోమల, మే 29 (ఆంధ్రజ్యోతి): సోమల సమీపంలోని భారతంమిట్టలో మహా భారత యజ్ఞం గురువారం ప్రారంభమైంది. తొలుత పంచపాండవుల విగ్రహాలను గన్నావారిపల్లె, భారతంమిట్ట, వడ్డిపల్లె, రాశెట్టివారిపల్లె, దాసరివారిపల్లెల్లో ఊరేగించారు. అనంతరం ధర్మరాజులు ఆలయం వద్ద విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు జరిపారు. అర్చకుల ఆధ్వర్యంలో ఆలయం ఆవరణంలో పలు హోమాలు జరిపారు. ధ్వజారోహణం జరిపించారు.

అలరించిన పద్మవ్యూహం..

నంజంపేట గార్గేయ నదీ తీరంలోని గార్గేయ గౌరీలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహాభారతం యజ్ఞం సందర్భంగా పద్మ వ్యూహం ఘట్టాన్ని భాగవతారణి రత్నకుమారి ఆలపించారు.

6733 మందికి పింఛన్లు

కల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో 6733 మంది లబ్ధిదారులకు శనివారం పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలిపారు. జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో మే 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఆ మేరకు సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం పింఛన్లు పంపిణీ చేస్తారని, లబిదారులు తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని ఎంపీడీవో కోరారు.

మహానాడుకు తరలిన బైరెడ్డిపల్లె పసుపుసేన



బైరెడ్డిపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు కార్య క్రమంలో పాల్గొనేందుకు గురువారం బైరెడ్డిపల్లె నుంచి భారీసంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలి వెళ్లాయి. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి ఆధ్వర్యం లో దాదాపు 15 బస్సులు, 20 కార్లలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద తెలుగు దేశం జిందాబాద్, జై చంద్రబాబు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నాయకత్వం వర్థిల్లాలి అంటూ కార్యకర్తలు నినాదాలతో వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలు పూర్తిచేయండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాల లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్ పీడీ, ఈఈ, డీఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను కలిసి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. సక్రమంగా విధులు నిర్వర్తించని వారికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని పీడీని ఆదేశించారు. ఇసుక కొరత లేకుండా చూడాలని, నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఎఫ్‌టీవో జనరేట్ చేసి బిల్లుల చెల్లింపులు పూర్తిచేయాలన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


బైరెడ్డిపల్లెలో యోగా చేస్తున్న ప్రభుత్వశాఖల సిబ్బంది

బైరెడ్డిపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ తెలియజేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద గురువారం సచివాలయ సిబ్బందితో పాటు వివిధశాఖల సిబ్బందికి యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగా మాస్టర్ ట్రైనర్లు బాలాజీ, శాంతి, అమరావతి యోగాసనాలు వేయించారు. యోగావల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈసీఎస్ ఏపీవో హరినాథ్, ఎంసీవో సురేష్‌బాబు, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ అశోక్, పంచాయతీ కార్యదర్శులు సదాశివయ్య, మోహన్ రాంప్రసాద్, రాజశేఖర్, మహేష్, బాలాజీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ధరలతో ఈగల బుట్టలు



పుంగనూరు రూరల్, మే29(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ ధరలతో ఈగల బుట్టలను ప్రభుత్వం అందిస్తోందని హార్టికల్చర్ ఆఫీసర్ వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మామిడి పండ్లలో ఈగల నివరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మామిడి పండ్లపై ఈగ పడకుండా రాయితీతో ఈగల నివారణ బుట్టలను సబ్సిడీ ధరలతో ఇవ్వనున్నట్లు తెలిపారు. బుట్టలను రూ. 11లకే అందజేయనున్నట్లు చెప్పారు. బుట్టలు కావాల్సిన రైతులు భూమి పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్‌లు రైతు సేవా కేంద్రంలో అందించి పొందవచ్చని తెలియ జేశారు.

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు



సోమల, మే 29 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహానాడుకు గురువారం ప్రత్యేక బస్సుల్లో, వాహనాల్లో వెళ్లారు. సోమల మండలం నుంచి 20 బస్సులు, 30 ప్రత్యేక వాహనాలు కందూరుకు చేరుకోవడంతో పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పార్టీ జెండా ఊపి స్వాగ తించి కడపకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, నాయకులు హరిప్రసాద్, వేణుగోపాల్ నాయుడు, పి.శ్రీనివాసులు, మహేంద్రబాబు, షేక్ అమానుల్లా, అష్రఫ్ అలీ, శివశంకర్, మల్లికార్జున, సుబ్రమణ్యం యాదవ్, చాణుక్య, సతీశ్, ఈశ్వర్‌యాదవ్, రమేశ్‌నాయుడు, వేణుగోపాల్ నాయుడు, శంకర్, శ్రీనివాసులు, మునిచంద్ర, భానుప్రకాశ్ నాయుడు, సుబ్బరాయులు, ఉమాపతి నాయుడు, పాల శ్రీనివాసులు, బాలాజీ నాయుడు, రమణయ్య, రెడ్డిమోహన్, మోహన్‌నాయుడు, బోస్, కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కడపకు తరలిన పసుపు దండు



కల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడులో గురువారం నిర్వహించిన భారీ బహిరంగసభకు పులిచెర్ల మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని 25 పంచాయతీల నుంచి ఉదయం నుంచి బస్సులు, కార్లు తదితర వాహనాల్లో కడపకు బయలుదేరారు. ఆయా పంచాయతీల్లో స్థానిక టీడీపీ నేతల ఆధ్వర్యంలో వాహనాలు బయలుదేరాయి. మండలం నుంచి బయలుదేరిన అన్ని వాహనాలు కల్లూరు-పీలేరు జాతీయ రహదారి ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకోగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ధనంజయ నాయుడు టీడీపీ జెండాను ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

8 బస్సులు, 25 కార్లలో మహానాడుకు


మహానాడుకు బయలుదేరిన టీడీపీ శ్రేణులు

గంగవరం, మే29(ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు మహానాడుకు బయల్దేరారు. గురువారం గంగవరం సమీపంలో 8 బస్సులు, 25 కార్లకు ప్రత్యేక పూజలు చేసి కడపలో జరుగుతున్న మహానాడు బహిరంగ సభకు పయన మయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు జెండాను ఊపి బస్సులను, కార్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, సుబ్బారెడ్డి, గిరిధర్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా

పుంగనూరు, మే29(ఆంధ్రజ్యోతి): అధికారులు, పాలకుల సమష్టి కృషితో పట్టణాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ సమస్యలను కౌన్సిలర్లు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్ నటరాజ మాట్లాడుతూ అంజెడా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చెప్పడంతో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన సదుం తమ్ముళ్లు



సదుం, మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సదుం మండలం నుంచి భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు గురువారం తరలివెళ్లాయి. ప్రతి పంచాయతీ నుంచీ పార్టీ తరఫున ఏర్పాటు చేసిన బస్సులతోపాటు స్వచ్ఛందంగా సుమారు 50 వాహనాల్లో పార్టీ శ్రేణులు కడపకు బయలుదేరాయి. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అమరనాథ్‌గౌడ్, పవన్ కుమార్ రెడ్డి, నారాయణ గౌడ్, వెంకటరమణారెడ్డి, మునిరెడ్డి, కుమార్, మారుతీశ్వరరెడ్డి, ఆనందరెడ్డి, జోగ మధుసూదన్ రెడ్డి, మైనారిటీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

మన శరీరానికి మనమే డాక్టర్


యోగా సాధన చేస్తున్న అధికారులు, ప్రజలు

సోమల, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సోమల తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. గురువారం సోమల ఎంపీడీవో కార్యాయం వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఆందోళన, ఒత్తిడి కారణంగా రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. యోగాతో కలిగే ఉపయోగాలను గుర్తించి ప్రతి ఒక్కరూ రోజూ యోగాను సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శివరత్న, యోగా శిక్షకులు కరుణానిధి, చిన్నప్ప, సచివాలయ, అంగన్వాడీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు


జెండా ఊపి బస్సులను సాగనంపుతున్న గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, మే29(ఆంధ్రజ్యోతి):కడపలో జరుగుతున్న మహానాడు బహిరంగ సభకు చౌడేపల్లె నుంచి టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు తరలివెళ్లారు. గురువారం ఆయన తిరుపతి రోడ్డులోని పెట్రోల్‌బంక్ వద్ద మహానాడు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కళ్యాణ్, రమణ, మునెంకటప్ప, మహ్మద్‌గని, అమీద్‌ఖాన్, యల్లకుంట్ల రమేష్, కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వెంకటేష్, గణపతి, సురేష్, విజయ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


పశువుల దాణాను పంపిణీ చేస్తున్న డాక్టర్ దినేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి

చౌడేపల్లె, మే29(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పుదిపట్ల పంచాయతీలో పాడిరైతులు 50 శాతం రాయితీ ధరతో పశువుల దాణాను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మహానాడు సభకు తరలిన వి.కోట పసుపు సైన్యం

వి.కోట, మే 29(ఆంధ్రజ్యోతి): కడప మహానాడు బహిరంగ సభకు వి.కోట పసుపు సైన్యం భారీగా తరలి వెళ్లింది. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమకూర్చిన ప్రత్యేక బస్సుల్లో గురువారం ఉదయం మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ దగ్గరుండి వాహనాలకు సంబంధించిన ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నేతలు రాంబాబు, ధీరజ్, ఈశ్వర్, రామూర్తి, భక్తా, హరినాథరెడ్డి, గంట్లప్పగౌడు, దాము, గుణ, ఇంకా పలువరు కార్యకర్తలు ఉన్నారు.



వి.కోట నుండి బహిరంగ సభకు తరలుతున్న టీడీపీ శ్రేణులు, కడప మహానాడు సభలో ఆశీనులైన టీడీపీ నేతలు, కార్యకర్తలు

ఆధార్ కేంద్రం తనిఖీ

వెదురుకుప్పం, మే 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఆధార్ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో చంద్రమౌళి తనిఖీ చేశారు. ఉద్యోగులకు పలు సూచనలిచ్చారు.

కౌలు రైతు సర్టిఫికెట్లు తీసుకోండి

వెదురుకుప్పం, మే 29 (ఆంధ్రజ్యోతి): కౌలుకు భూమి సాగు చేస్తున్న రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకెళ్లి కౌలు రైతు సర్టిఫికెట్లు తీసుకోవాలని వ్యవసాయాధికారి వనిత సూచించారు. దీనిద్వారా ప్రభుత్వ రాయితీలు పొందవచ్చన్నారు.





హంస వాహనంపై వరదుడి విహారం


సప్పరంపై మత్స్యావతారంలో స్వామివారు

యాదమరి, మే 29 (ఆంధ్రజ్యోతి): యాదమరి త్రివేణి సంగమంలో ఉన్న వరదరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం మూలవిరాట్‌కు నిత్యం కైంకర్యాలు చేశాక భక్తులను దర్శనానికి అనుమతించారు. తర్వాత సప్పరంపై మత్స్యావతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై సరస్వతీదేవి అలంకరణలో వరదుడు మాడవీధుల్లో విహరించారు. వాహన సేవల ముందు భక్త బృందం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా, శుక్రవారం ఉదయం సప్పరంపై ఊరేగింపు, రాత్రి యాళి వాహనసేవ జరగనుంది.


హంసవాహనంపై వరదరాజస్వామి

గృహ నిర్మాణాల లక్ష్యాలు పూర్తిచేయండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాల లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్ పీడీ, ఈఈ, డీఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను కలిసి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. సక్రమంగా విధులు నిర్వర్తించని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీడీని ఆదేశించారు. ఇసుక కొరత లేకుండా చూడాలని, నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఎఫ్‌టీవో జనరేట్ చేసి బిల్లుల చెల్లింపులు పూర్తిచేయాలన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలకు ధ్వజారోహణం

యాదమరి, మే 29 (ఆంధ్రజ్యోతి): చెన్నారెడ్డిపల్లెలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలకు గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. హరికథా కాలక్షేపం మొదలైంది. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామికి పూజలు

మునేశ్వరుడికి ప్రత్యేక పూజలు


పూజా సామగ్రి తీసుకెళుతున్న పాపసముద్రం గ్రామస్తులు

గుడిపాల, మే 29 (ఆంధ్రజ్యోతి): పిళ్లారికుప్పం సమీపంలో నిర్మించిన మునేశ్వరుడు, ద్రౌపది, ధర్మరాజుల ఆలయ కుంభాభిషేకంలో భాగంగా గురువారం పాపసముద్రం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ధర్మకర్త మొగిలిరెడ్డి తీర్థప్రసాదాలు అందించారు. గ్రామ పెద్దలు సుధాకర్‌రెడ్డి, చిట్టిబాబు, రమేష్‌రెడ్డి, మాణిక్యం, నిర్వాహకులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

నగరి, మే 29 (ఆంధ్రజ్యోతి): రోజూ యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. పీసీఎన్ ప్రభుత్వ పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాస్టర్ ట్రైనర్ల ద్వారా సచివాలయ, మెప్మా సిబ్బందికి యోగాపై శిక్షణ ఇచ్చారు. పీఈటీ సురేష్, మాస్టర్ ట్రైనర్లు కవిత, నాగరత్నం, డీఈఈ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమావేశం



నగరి, మే 29 (ఆద్రజ్యోతి): నగరిలో ఆశా వర్కర్ల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కోదండయ్య, చందామర్రై మాట్లాడుతూ.. నగరిలో త్వరలోనే నిర్వహించే ఆశావర్కర్ల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో కనీస వేతనం రూ.26వేలు, గ్రాట్యుటీ కింద రూ.1,50,000 ఇవ్వాలని, వయో పరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేయనున్నట్లు చెప్పారు. నాయకురాలు కోకిల తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేలకు చేరిన వేరుశనగ విత్తనాలు

పెనుమూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందించే సబ్సిడీ వేరుశనగ విత్తనాలు రైతు సేవా కేంద్రా (ఆర్‌ఎస్‌కే)లకు చేరాయి. 30 కిలోల బస్తా రూ.1,674కి రైతులకు అందిస్తామని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు తెలిపారు. దీనికోసం రైతులు.. పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ చూపి రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం


సమావేశంలో పాల్గొన్న అధికారులు

పెనుమూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల సర్వసభ్య సమావేశం గురువారం తూతూమంత్రంగా నిర్వహించారు. 12 మంది ఎంపీటీసీల్లో నలుగురు, 23 సర్పంచుల్లో నలుగురు మాత్రమే పాల్గొన్నారు. అధికారులు కూడా కొందరు హాజరు కాకపోవడంతో సమస్యలపై మాట్లాడేవారే లేక త్వరగా సమావేశాన్ని ముగించారు. అనవసరమైన దారి సమస్యలతో సమయం వృథా అవుతోందని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ అన్నారు. వ్యవశాయ శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. చాలామంది రైతులు చనిపోయి వారి భూమిని వారసులకు మార్చకపోవడంతో అన్నదాత సుఖీభవకు అనర్హులుగా మిగిలి పోతున్నారన్నారు. మండలంలో ఇటువంటివారు సుమారు 700 మంది ఉన్నారని చెప్పారు. ఎంపీపీ హేమలత, జడ్పీటీసీ దొరస్వామి, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6న వెదురుకుప్పం మండల సమావేశం

వెదురుకుప్పం, మే 29 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ ఆరో తేదీన ఎంపీడీవో కార్యాలయపు సమావేశపు మందిరంలో జరగనుంది. ఈ మేరకు ఎంపీడీవో ఎల్.పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులకు, ఉద్యోగులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు.




కడపకు బయల్దేరే ముందు చిత్తూరులో కేక్ కట్ చేసిన టీడీపీ నాయకులు

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

చిత్తూరు సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడులో చివరి రోజున నిర్వహించిన బహిరంగ సభకు జిల్లా నుంచి టీడీపీ శ్రేణులు భారీ స్థాయిలో తరలివెళ్లాయి. చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాల మైదానం నుంచి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నాయకులు, కార్యకర్తలు కడపకు పలు వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, గుడిపాల మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడులు వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, మధు నాయుడు, అనిల్, మోహన్‌రాజ్, రాజశేఖర్, శశికర్ బాబు, మేషాక్, జగదీశ్వర్ నాయుడు, శ్యామ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలిగేదెప్పుడు?

రాత్రయితే ఇందిరమ్మ కాలనీలో అంధకారం

చిత్తూరు సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మురకంబట్టు బైపాస్‌రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో మూడేళ్ల కిందట వీధి దీపాలు ఏర్పాటు చేశారే కానీ ఇప్పటి వరకు అవి వెలగడం లేదు. మరోవైపు సంతపేట నుంచి మురకంబట్టు బైపాస్ రోడ్డుకు కలిసే మలుపు వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయలేదు. ఈ మార్గంలో క్యాంఫర్డు పాఠశాల, సీతమ్స్ కళాశాల, డిస్టిలరీస్ కంపెనీ, అపోలో కళాశాల, ఎస్వీ సెట్‌కు వందలాది వాహనాలు రాకపోకలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో ఈ ప్రాంతాల్లో వీధి దీపాలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు, ద్విచక్రవాహన చోదకులనైతే ఆకతాయిలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మూడు రోడ్ల కూడలిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో పాటు ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు వెలిగేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.


సెంట్రల్ లైటింగ్ లేకుండా ఉన్న మురకంబట్టు బైపాస్ రోడ్డు మలుపు


ఇందిరమ్మ కాలనీకి ఇరువైపులా అలంకారప్రాయంగా ఉన్న వీధి దీపాలు

6న శిథిల భవనాల తొలగింపు వేలం

బైరెడ్డిపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో శిథిలమైన రెండు వసతిగృహ భవనాలను తొలగించడానికి జూన్ 6వ తేదీన బహిరంగ వేలం వేయనున్నారు. ఈ మేరకు ఆ రోజున పాఠశాల ఆవరణలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శోభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు రూ.10వేల ధరావత్తు, రూ.3వేల ప్రవేశ రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. సంబంధిత డీడీలను ప్రిన్సిపాల్, ఏపీఆర్ స్కూల్, కమ్మనపల్లె పేరుమీద తీసి జూన్ 5వతేదీ లోపు పాఠశాలలో అంద జేయా లని వెల్లడించారు. వివరాలకు 8712625057 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లో పనిచేసే ఆయాలకు పెండింగ్ జీతాలివ్వండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఏఐటీయూసీ నేతల వినతి

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.నాగరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 2021 వరకు ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 350 మంది ఆయాలకు 36 నెలల జీతాలు ఇవ్వలేదని చెప్పారు. వేసవి సెలవులు ప్రకటించినా పాఠశాలలకు ఆయాలు వెళ్తున్న దృష్ట్యా పూర్తి జీతం ఇవ్వాలని కోరారు. అలాగే వారికి గుర్తింపు కార్డులు, యూనిఫాం అందించాలన్నారు. కలెక్టర్ అప్పటికప్పుడే స్పందించి డీఈవోతో సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామర్లై, ఆయాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశ, జయకుమారి, హసీన, కోకిల పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు సెంట్రల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి సూచించారు. గురువారం జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. జిల్లాలో లక్ష మంది సభ్యులను పారిశ్రామికవేతలుగా చేయాలనే లక్ష్యంతో నెలకు 30వేల మందిని గుర్తించాలన్నారు. అర్హులందరికీ పథకాలు చేరవయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, డీపీఎం రవి, ఏపీఎంలు హేమ, సుబ్బారెడ్డి, మధు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీదేవి


బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపునీరు

చినుకుపడితే తిప్పలు తప్పడం లేదు

సామిరెడ్డికండ్రిగ వాసుల ఆవేదన

విజయపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే తిప్పలు తప్పడం లేదని సామిరెడ్డికండ్రిగ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలో తచ్చూరు - చిత్తూరు హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. గ్రామానికి వెళ్లడానికి సౌకర్యంగా హైవే కింద వెళ్లేలా ఓ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. కానీ అక్కడ వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోతోంది. ఇంకడానికి సుమారు పది రోజులకు పైగా పడుతోంది. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సబ్సిడీ ధరలతో ఈగల బుట్టలు

పుంగనూరు రూరల్, మే29(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ ధరలతో ఈగల బుట్టలను ప్రభుత్వం అందిస్తోందని హార్టికల్చర్ ఆఫీసర్ వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మామిడి పండ్లలో ఈగల నివరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మామిడి పండ్లపై ఈగ పడకుండా రాయితీతో ఈగల నివారణ బుట్టలను సబ్సిడీ ధరలతో ఇవ్వనున్నట్లు తెలిపారు. బుట్టలను రూ. 11లకే అందజేయనున్నట్లు చెప్పారు. బుట్ట లు కావాల్సిన రైతులు భూమి పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్‌లు రైతు సేవా కేంద్రంలో అందించి పొందవచ్చని తెలియ జేశారు.



తాగునీటి వృథాను అరికట్టలేరా?


యాదమరిలో వృథాగా పోతున్న తాగునీరు

యాదమరి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీరు వృథాగా రోడ్డు మీద పారుతోంది. మంచినీటి పైపుల లీకేజీ కారణంగా చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలోని యూనియన్ బ్యాంక్ వద్ద నీరు వృథాగా ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో గతనెలలో రెండు పర్యాయాలు ఇలాగే నీరు పారింది. ఇకనైనా మంచి నీరు వృథా కాకుండా పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు: ఆర్డీవో

పలమనేరు, మే 29 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పలమనేరు ఆర్డీవో పి.భవాని హెచ్చరించారు. గురువారం పలమనేరు డివిజన్ పరిధిలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పీసీఅండ్‌పీఎన్‌డీటీ ఆక్టు-1994పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. డివిజన్ పరిధిలో ప్రైవేటు నర్సింగ్ హోమ్స్ వారు, ఆర్ఎంపీ, పీఎంపీ ప్రాక్టీషనర్స్ చట్ట వ్యతిరేకంగా లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు, అబార్షన్‌లకు పాల్పడితే శిక్షలు తప్పవన్నారు. డివిజన్ స్థాయిలో లింగనిష్పత్తి సమాన స్థాయిలోకి తీసుకురా వడానికి అధికారులు కృషిచేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళాసంఘాలు, క్షేత్ర స్థాయిలో అబార్షన్లు , బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు, జిల్లా అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి జయరాములు, కన్వీనర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి, పలమనేరు డివిజన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, రేడి యాలజిస్టు, గైనకాలజిస్టు, చిన్నపిల్లల వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, ఎన్జీఓలు, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులు, సీహెచ్ఓలు, హెల్త్ ఎడ్యుకేటర్లు, సూపర్‌వైజర్లు హాజరయ్యారు.

స్టాక్ పాయింట్‌కు చేరిన విద్యాసామగ్రి

సోమల, మే 29 (ఆంధ్రజ్యోతి): సోమల జడ్పీ హైస్కూల్‌కు విద్యాసామగ్రి చేరుకొన్నట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. మండలంలోని ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అచ్చుపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, బెల్టు, షూ, యూనిఫామ్ విద్యాశాఖ నుంచి స్టాక్ పాయింట్‌కు చేరుకున్నాయని తెలిపారు. పాఠశాలలు తెరవగానే ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని వివరించారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు


కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో జంతు సంరక్షణ కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో శాశ్వత ప్రాతిపదికన వీధి కుక్కల నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై జంతు సంరక్షణ కమిటీ సభ్యులు గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కమిటీ సభ్యులు పి.మాలతి, పి.మంజునాథ్ రెడ్డి, ఆర్తి, విజయ శిరీష కలిశారు. వీధికుక్కలకు ఆశ్రయం లేకపోవడం, ఆహారం, వైద్య సేవలు వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తేగా తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

కాణిపాకంలో ఆవాహిత దేవతారాధన


లఘు పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

ఐరాల(కాణిపాకం), మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న వీరాంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, అష్ట బంధనం, మహాకుంభాభిషేకంలో భాగంగా ఆవాహిత దేవతారాధనను అర్చక, పండితులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఆలయ పునఃనిర్మాణ దాత అనిల్‌కుమార్ కుటుంబీకులు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం మహాకుంభాభిషేకం జరగనుంది.

అక్రిడిటేషన్ కార్డుల గడువు మూడు నెలల పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును జూన్ ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీవరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్, డీఎంఏసీ చైర్మన్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు శనివారంతో ముగియనున్న సందర్భంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

లేకుంటే 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్న రైతులు


మీడియాతో మాట్లాడుతున్న మామిడి రైతులు

చిత్తూరు సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మామిడికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ఇటీవల కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి.. రైతులవద్ద గిట్టుబాటు ధరతో మామిడి కాయలు కొనుగోలు చేయాలని చెప్పారన్నారు. అయినా ఇంతవరకు గుజ్జు పరిశ్రమలవారు రైతుల వద్ద కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. ఇంకొన్ని రోజులు ఇలాగే ఉంటే తోటల్లోనే కాయలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. తోతాపురి రకానికి కిలోకు కనీసం రూ.15 నుంచి రూ.20 ఇవ్వాలని కోరారు. సీఎం చంద్రబాబు స్పందించి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, లేకుంటే శరణ్యమని వాపోయారు. ప్రభుత్వం స్పందించకపోతే వచ్చేనెల 2వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులు ప్రకాష్, హరిబాబు నాయుడు, బాలాజినాయుడు, రఘునాథ నాయుడు, జయచంద్రనాయుడు, లోకనాథ నాయుడు, దేవరాజులు, చిన్నబ్బ రెడ్డి, శేషాద్రి రెడ్డి, లోక తదితరులు పాల్గొన్నారు.



రెడ్డివారిపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి చెట్లు - రెడ్డివారిపల్లె వద్ద ఏనుగులు తొక్కివేసిన టమోటా తోట

ఏనుగుల గుంపు స్వైరవిహారం

సోమల, మే 29 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పేటూరు పంచాయతీలోని రెడ్డివారిపల్లె గ్రామ సమీపంలో ఏనుగుల గుంపు టమోటా, మామిడి తోటల్లో స్వైరవిహారం చేశాయి. బుధవారం పగలే రాంపల్లె బీట్ పరిధిలో ఏనుగులు సంచరించడంతో రైతులు భయందోళనచెందారు. రాంపల్లె, కొత్తూరు, పత్రపల్లె, ఎగువ కొత్తూరు రైతులు, అటవీ అధికారులు టపాసులు పేల్చి రెడ్డివారిపల్లె వైపు మళ్లించారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి రెడ్డివారిపల్లె సమీపంలోని ఎలకలోని కుంట వద్ద రైతులు అనిల్, ఆనందరెడ్డికి చెందిన టమోటా, మామిడి తోటల్లో తిరగాడి పంటలను తొక్కివేశాయి. ఏనుగుల ఘీంకారాలతో పొలాల వద్ద ఉన్న రైతులు భయంతో గ్రామాకి చేరుకున్నారు. చిన్న ఉప్పరపల్లె, ఆవులపల్లె పంచాయతీ అటవీ సమీప టమోటా తోటల్లో కోతలు కోయడానికి రైతులు వెనకాడుతున్నారు. ఏ సమయంలో ఏనుగులు వస్తాయో తెలియక రైతులు భయాందోళనచెందుతున్నారు. కొందరు రైతులు జట్లుగా ఏర్పడి పొలాల వద్ద టపాసులు పేల్చుకుంటూ, డప్పుల శబ్దం చేస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.




ఏనుగులు విరిచిన మామిడి చెట్లు - ఏనుగులు తిని తొక్కేసిన మామిడి కాయలు - ఏనుగులు తొక్కేసిన వరి పంటపంట

పొలాలను ధ్వంసం చేసిన గజరాజులు

చౌడేపల్లె, మే29(ఆంధ్రజ్యోతి): పంట పొలాలను ఏనుగులు గుంపు ధ్వంసం చేశాయి. బుధవారం రాత్రి 14 ఏనుగుల గుంపు మండలంలోని చుక్కావారిపల్లె, పందిళ్లపల్లె, తుప్పిరెడ్డిపల్లెలలోని రైతుల పంటలలో స్వైర విహారం చేశాయి. రైతు శ్రీనివాసురెడ్డి టమోటా పంటను ధ్వంసం చేశాయి. అలాగే ఎం. శ్రీనివాసులురెడ్డి, గంగిరెడ్డి మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు విరిచేశాయి. కాయలు నేలరాల్చి తిన్నంత తినేశాయి. గణపతి వరి పొలాన్ని తొక్కేశాయి. ఎఫ్ఆర్‌వో శ్రీరాములు, ఎఫ్ఎస్‌వో బాలసుబ్రహ్మణ్యం, ఎఫ్‌బీవో కిరణ్‌లు డప్పులు వాయించి ఏనుగులను చుక్కావారిపల్లె మీదుగా ఉప్పరపల్లెలోని పెద్ద వంక అడవిలోకి తరిమేశారు.


ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

జడ్పీలో 27 మంది ఉద్యోగులకు

బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్(జడ్పీ)లో ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభమైంది. సీఈవో రవికుమార్ నాయుడు 27 మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో తొమ్మిది మంది ఏవోలుండగా నలుగురికి ఐదేళ్ల పూర్తవగా, ఐదుగురు రిక్వెస్ట్‌పై బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. అలాగే 18 మంది సీనియర్ అసిస్టెంట్లలో తొమ్మిది మందికి ఐదేళ్ల పూర్తవగా, తొమ్మిది మంది రిక్వెస్ట్‌పై బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. నేడు జూనియర్ అసిస్టెంట్లకు, టైపిస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో తెలిపారు.


మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి.పగలు....ఒక్కోసారి సాయంత్రం పూట వున్నట్లుండి మబ్బులు కమ్ముకుంటాయి. భారీవర్షం వచ్చే సూచనలు కన్పిస్తాయి. అయితే వర్షం పడదు.సాయం సంధ్యవేళ నీలి మేఘాలు మాత్రం ప్రత్యేకంగా దర్శనమిస్తుంటాయి.

2వేల మంది వైద్య సిబ్బందితో

నేడు యోగా

చిత్తూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిత్తూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది వైద్యసిబ్బందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగామ్ ఆఫీసర్ల నుంచి వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొనాలని ఆదేశాలిచ్చారు. ఉదయం ఆరు గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

కొనసాగుతున్న జంట ఏనుగుల విధ్వంసం

అరటి, మామిడి తోటలకు నష్టం


ఎస్.గొల్లపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి కొమ్మలు, నేలరాలిన మామిడికాయలు

రామకుప్పం, మే 29 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఎస్.గొల్లపల్లె అటవీ శివారు ప్రాంతంలో పంట పొలాలపై జంట ఏనుగుల విధ్వంసం కొనసాగుతోంది. మొన్న నారాయణపురం తాండా.., నిన్న ననియాల తాండా.., నేడు ఎస్.గొల్లపల్లె.. ఇలా రోజూ ఏదో ఓ చోట నెలరోజులుగా పంటలపై పడి ఏనుగులు విధ్వంసం సృష్టిస్తూనే ఉన్నాయి. తాజాగా బుధవారం రాత్రి ఎస్.గొల్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న పలువురు రైతులకు చెందిన అరటి, మామిడి తోటలోకి జొరబడ్డాయి. కాయలను తిన్నాయి. చెట్లను విరిచేశాయి. తొలుత నాగభూషణ్‌రెడ్డి, గంట్లప్పగౌడు, రామలక్ష్మి, విశ్వనాథ్, భక్తవత్సల రెడ్డిలకు చెందిన మామిడి తోటలోని చెట్లను విరిచేశాయి. కాయలను నేలరాల్చాయి. అక్కడి నుంచి మురుగేష్‌గౌడు, జయరామప్పలకు చెందిన అరటి తోటలోకి వెళ్లి అరటికాయలు తిని చెట్లను విరిచేశాయి. పలు రకాల వ్యవసాయ పరికాలను తొక్కేశాయి. అటవీ అధికారులు గజదాడుల నుంచి పంటలను రక్షించాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.


'మహా'సైకిల్


సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు







మహా జాతర

కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





